సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 28 । నవంబర్ । 2024



ఫోర్జరీ సంతకాలతో..
మున్సిపల్ కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేసి రుణం స్వాహా చేశారని సమభావన సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు.
- 8లో



డేటా ఎంట్రీ పూర్తి చేయాలి
సమగ్ర సర్వే డేటాను తప్పులు లేకుండా ఎంట్రీ పూర్తి చేయాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు.
- 9లో



చదువుతో అద్భుతాలు సృష్టించొచ్చు
చదువుతో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.
- 10లో

న్యూస్‌రీల్

నేడు జిల్లా పరిషత్ సమీక్ష సమావేశం

భువనగిరిటౌన్: జిల్లా ప్రజా పరిషత్ సమీక్ష సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్‌కు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉంటారని, ఆయన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మోటకొండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎంఎఫ్ జిల్లా కార్యదర్శి కలకోట రాజగోపాల్, మండల అధ్యక్షుడు వడ్డెపల్లి సుదర్శన్, ఎండీ ఫరూక్, ఉపాధ్యాయులు చొల్లేటి శ్రావణ్‌కుమార్, సుధారాణి, విశ్వరూపం, ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రమేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో నిత్యపూజలు



ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఇక ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం జరిపించి, ఆలయ ద్వార బంధనం చేశారు.

29న జిల్లా స్థాయి క్రీడాజట్ల ఎంపిక

ఆలేరురూరల్: ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14 ఫుట్‌బాల్ విభాగంలో బాల, బాలికల క్రీడా జట్టు ఎంపిక పోటీలు ఆలేరు పట్టణ కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ బుధవారం తెలిపారు. 2011 జనవరి 1 తర్వాత జన్మించిన బాల, బాలికలు బోనోఫైడ్, ఆధార్ కార్డ్‌తో ఎంపిక పోటీలో పాల్గొనాలని పేర్కొన్నారు.

పల్లె దవాఖాన పరిశీలన

భువనగిరిరూరల్: భువనగిరి మండలం అనంతారం గ్రామంలో ఉన్న పల్లె దవాఖానాను జిల్లా మాత శిశు సంక్షేమ ఆరోగ్య అధికారి యశోధ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి బుధవారం నిర్వహిస్తున్న విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే లో భాగంగా ప్రతి పిల్లవాడికి సంపూర్ణ టీకాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ మురళీమోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, శ్రీనివాస్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వసుధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవులు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్: క్రిస్మస్ 2024 వేడుకల సందర్భంగా క్రైస్తవులు, క్రైస్తవ సంస్థలకు అవార్డులు ప్రకటించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, విద్య, వైద్య, సాహిత్యం, కళలు, క్రీడలు మొదలగు వాటిలో సేవలందించిన క్రైస్తవులు, సామాజిక సేవ, విద్య, వైద్య రంగాల్లో విశేష సేవలందించిన క్రైస్తవ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయంలో డిసెంబర్ 5వ తేదీలోగా అందించాలని సూచించారు.



మొదటి ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన వాటర్ ఫాల్స్

పూర్తయినా ప్రారంభించలేదు..

యాదగిరిగుట్ట: క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు తిరిగి వెళ్లే సమయంలో ఆహ్లాదాన్ని పెంచేందుకు వైటీడీఏ అధికారులు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వెళ్లే మొదటి ఘాట్ రోడ్డులో వాటర్ ఫాల్స్ ఏర్పాటు చేశారు. ఉద్ఘాటన కంటే ముందే ఈ వాటర్ ఫాల్స్ పనులు పూర్తయినప్పటికీ నేటికీ ప్రారంభించలేదు. వైటీడీఏ అధికారులు పలుమార్లు వీటిని ట్రయల్ రన్ చేసి పరిశీలించారు. కాని ప్రారంభానికి చర్యలు తీసుకోలేదు.

ఆరోగ్యానికి చలి ముప్పు

- రోజు రోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- రాజాపేటలో 15.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు
- డిసెంబర్, జనవరిలో చలి మరింత పెరిగే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



రెండు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా.. (డిగ్రీల సెల్సియస్‌లో)

మండలం	26వ తేదీ	27వ తేదీ
బొమ్మలరామారం	13.2	16
వలిగొండ	14.1	17
రామన్నపేట	14.2	18
రాజాపేట	14.5	15.3
గుండాల	14.5	17
చౌటుప్పల్	14.5	18
మోటకొండూర్	14.6	18.5
ఆలేరు	14.6	19.5
తుర్కపల్లి	14.7	17.9
పోచంపల్లి	14.8	19
మోత్కూర్	14.9	20
భువనగిరి	15.0	20.1

సాక్షి, యాదాద్రి: జిల్లాలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. సాయంత్రం ఆరు దాటిందంటే జనాలు బయట రావడానికి భయపడుతున్నారు. బుధవారం రాజాపేట మండలంలో 15.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇక పోచంపల్లి మండలంలో19, రాజాపేట మండలంలో15.3, చౌటుప్పల్ మండలంలో18, మోటకొండూరులో 18.5, వలిగొండలో 17, ఆలేరు మండలంలో 19.5 కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. చలి కారణంగా చిన్న పిల్లలు, వృద్ధులు దగ్గు, జలుబు, జ్వరం, ఆస్తమాతో బాధపడుతున్నారు. ఇదిలా ఉండగా.. డిసెంబర్, జనవరిలో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది.

పిల్లలు, వృద్ధుల్లో అలర్జీ లక్షణాలు

పెరుగుతున్న చలి కారణంగా పిల్లలు, వృద్ధుల్లో అలర్జీ లక్షణాలు కనిపిస్తున్నాయి. కాళ్లు, చేతులపై చర్మం ముడత పడటంతో పాటు కీళ్ల సంబంధ సమస్యలు వస్తున్నాయి. కొంతమందిలో శ్వాసకోశ సమస్యలు కనిపిస్తున్నాయి. చర్మం పొడిబారడం కారణంగా దురద, మంటతో పాటు పగుళ్లు ఏర్పడుతున్నాయి. చాలా మందిలో జ్వరం లక్షణాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. చలి తీవ్ర ప్రభావం నుంచి తప్పించుకోవడానికి రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అవకాశం ఉన్నవారు ఉదయం తొమ్మిది గంటల తర్వాతనే బయటకు రావాలని, సాయంత్రం 5 గంటల లోపు ఇళ్లకు చేరుకోవాలని చెబుతున్నారు.

తప్పని వెతలు..

ప్రతి రోజూ ఉదయం నుంచే చల్లటి గాలులు వీస్తున్నాయి. సాయంత్రం 5 గంటల తర్వాత చలి తీవ్రత క్రమక్రమంగా పెరుగుతోంది. రోడ్లపై పనిచేసే మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, పాల వ్యాపారులు, పేపర్ బాయ్స్, రోజువారీ కూలీలు, వివిధ పనుల కోసం తెల్లవారు జామునే వెళ్లే వారు చలికి అనారోగ్యానికి గురవుతున్నారు.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి



చలికాలంలో వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నపిల్లలను చలిగాలిలో తిప్పకుండా వెచ్చని వాతావరణంలో ఉండేలా చూడాలి. తప్పనిసరి బయటకు వెళ్లాల్సి వస్తే తలకు మంకీ క్యాప్, స్వెటర్, మాస్క్ ధరించాలి. డిసెంబర్ నుంచి జనవరి వరకు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. చలి గాలులు ఎక్కువగా వీచే సమయంలో కండరాల నొప్పులు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా బీపీ ఉన్న వాళ్లు జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ విలియమ్స్, పీహెచ్‌సీ వైద్యుడు, యాదగిరిగుట్ట

హాస్టళ్లలో అధికారుల రాత్రి నిద్ర



సంస్థాన్‌నారాయణపురం ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

- జిల్లాలోని 89 వసతి గృహాలను సందర్శించిన అధికార యంత్రాంగం
- సంస్థాన్‌నారాయణపురం ఎస్సీ బాలుర హాస్టల్‌లో రాత్రి బస చేసిన కలెక్టర్



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి, యాదాద్రి: ఇటీవల ప్రత్యేకాధికారులు వసతి గృహాల్లో రాత్రి బస చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో బుధవారం రాత్రి జిల్లా యంత్రాంగం రాత్రి బస చేసింది. కలెక్టర్ హనుమంతరావుతో సహా వివిధ శాఖల అధికారులు జిల్లాలోని 89 వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహంలో సమస్యలను అడిగి తెలుసుకుని విద్యార్థులతో కలిసి రాత్రి నిద్ర చేశారు. కాగా.. కలెక్టర్ సంస్థాన్‌నారాయణపురం ఎస్సీ బాలుర వసతి గృహంలో రాత్రి నిద్ర చేశారు. అంతకు ముందు ఆయన వసతి గృహంలో విద్యార్థుల వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

నెలకు ఒకసారి హాస్టల్ నిద్ర చేస్తాం : కలెక్టర్

సంస్థాన్‌నారాయణపురం ఎస్సీ బాలుర వసతి గృహంలో కలెక్టర్ రాత్రి నిద్ర సందర్భంగా ఆయన మాట్లాడారు. నెలకు ఒకసారి హాస్టల్ నిద్ర నిర్వహిస్తామని తెలిపారు. హాస్టళ్లలో సమస్యలను దీర్ఘకాలిక, తక్షణ సమస్యలుగా విభజించి పరిష్కరమిస్తామని చెప్పారు. జిల్లాలోని 678 ప్రభుత్వ పాఠశాల్లో కూడా ప్రత్యేకాధికారులను నియమించి, మధ్యాహ్న భోజనం పరిశిలిస్తామని తెలిపారు. వార్డెన్‌లు తప్పనిసరిగా హాస్టల్‌లో ఉండాలని ఆదేశించారు. తల్లిదండ్రులు విద్యార్థులను వసతిగృహాలకు రాని విద్యార్థులను తల్లిదండ్రులు పంపించాలని కలెక్టర్ కోరారు. పీహెచ్, సీహెచ్‌సీ, అంగన్‌వాడీలను కూడా తనిఖీ చేస్తామని పేర్కొన్నారు.



బొల్లేపల్లి ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి రాత్రి నిద్ర చేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు

వచ్చేనెల 4న జాతీయ సాధన సర్వే పరీక్ష

- ఇప్పటికే క్షేత్ర పరిశోధకులకు మొదటి విడత శిక్షణ పూర్తి
- రెండు, మూడు రోజుల్లో మరోసారి శిక్షణ



మొదటి విడత శిక్షణలో క్షేత్ర పరిశోధకులు

భువనగిరి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ సాధన సర్వే (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష నిర్వహిస్తోంది. వచ్చే నెల 4న పరీక్ష నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లపై యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 132 మంది క్షేత్ర పరిశోధకులను ఎంపిక చేశారు. 86 మంది పరిశీలకులను నియమించారు.

మరోసారి శిక్షణ

జిల్లాలో 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సర్వే చేయనున్నారు. మూడో తరగతి గణితం, ఈవీఎస్, ఆంగ్లం, తెలుగు, 6 వతరగతి విద్యార్థులకు గణితం, ఆంగ్లం, ఈవీఎస్, తెలుగు, 9వ తరగతి విద్యార్థులకు సామాన్య, సాంఘిక, తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు ఈ నెల 26న క్షేత్ర పరిశీలకులకు శిక్షణ ఇవ్వగా రెండు, మూడు రోజుల్లో మరోసారి శిక్షణ ఇవ్వనున్నారు.

పరీక్షలకు సన్నద్ధం చేయాలి

సర్వే పరీక్షలో విద్యార్థులు ప్రతిభను వెలికి తీసేందుకు అవకాశం ఉంటుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులు పరీక్ష రాసేలా ప్రధానోపాధ్యాయులు సహకరించాలి. పరీక్షలకు సంబంధించిన సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచనలు చేయాలి. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి.

– సత్యనారాయణ, డీఈఓ

ధాన్యం సేకరణ పూర్తిచేయాలి

రాజాపేట: మండలంలోని రేణికుంట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, రైతుల ఇబ్బందులు, ఎగుమతి చేసిన ధాన్యం వివరాలు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరితగతిన ధాన్యం సేకరణ పూర్తిచేయాలని సూచించారు. అనంతరం బసంతపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ దామోదర్, ఆర్ఐ రమేష్ తదితరులు ఉన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి

కాల్వ పూర్తి చేసి సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

ఆలేరురూరల్: ఆలేరు ప్రాంతానికి సాగునీరు అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. ఆలేరు మండలంలోని టంగుటూరు, పటేల్‌గుడెం గ్రామాల్లో గత 15 సంవత్సరాల క్రితం అసంపూర్తిగా నిర్మించి వదిలివేసిన దేవాదుల కాలువను బుధవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆలేరు ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో దేవాదుల ప్రాజెక్టులో భాగంగా అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి కాలువలు తవ్వి లైనింగ్ వేసి వదిలేశారన్నారు. పాలకులు మారుతున్నా పేదల బతులకు మాత్రం మారడం లేదన్నారు. ఆలేరు ప్రాంతం పంట పొలాలకు నీరులేక ఎడారిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు యోగ్యమైన భూములను సేకరించి కాలువలను తవ్వి వృథాగా వదిలివేయడంతో ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న కాలువలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఆలేరు పట్టణ, మండల కార్యదర్శి ఎంఏ ఇక్బాల్, దూపటి వెంకటేష్, సుదగాని సత్య రాజయ్య, తులసయ్య, దాసి శంకర్, మల్లేశం, ఉప్పలయ్య, మల్లిఖార్జున్, అశోక్, ఉదయ్, నవీన్, తదితరులున్నారు.

అంగన్‌వాడీలకు బెనిఫిట్స్ అందేనా..

- పింఛన్‌కు నోచుకోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు
- నాలుగు నెలలు గడుస్తున్నా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

అడ్డగూడూరు: అంగన్‌వాడీ కార్యకర్తలలు, ఆయాలకు ప్రభుత్వం గత నాలుగు నెలల క్రితం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో జిల్లాలో 65 ఏళ్ల పై బడిన 20 మంది అంగన్‌వాడీ టీచర్లు, 109 మంది ఆయాలు ఉద్యోగ విరమణ పొందారు. అయితే రిటైర్మెంట్ ప్రకటించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వారికి బెనిఫిట్స్ అందలేదు. పింఛన్ మంజూరు కాలేదు. కొన్ని దశాబ్దాలుగా అరకొర వేతనంతో నెట్టుకొస్తున్న వారికి ప్రస్తుతం ఆ జీతాలు కూడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం...

ప్రభుత్వం ముందుగా ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని ప్రకటించింది. దీనిపై అంగన్‌వాడీలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ బెనిఫిట్స్ పెంచాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం మరోసారి నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష బెనిఫిట్స్ అందిస్తామని స్వయంగా మంత్రి సీతక్క ప్రకటించారు. అయితే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సంగతి అటుంచితే నాలుగు నెలల గడుస్తున్నా కనీసం పింఛన్లు కూడా మంజూరు చేయలేదని వాపోతున్నారు.

పింఛన్ వస్తలేదు



నేను అంగన్‌వాడీ టీచర్‌గా చేసి జూలైలో ఉద్యోగ విరమణ పొందాను. విరమణ సమయంలో రూ.2లక్షలు ఇస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ పింఛన్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అప్పుడు వచ్చే జీతంతో ఇల్లు గడిచేది. ఇప్పుడు అది కూడా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నా.

– పుష్పమ్మ, రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్, అజీంపేట

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

జిల్లాలో 65ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నాలుగు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చింది. ఈమేరకు లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– నర్సింహారావు, డీడబ్ల్యూఓ, యాదాద్రి భువనగిరి

డయాలసిస్ రోగులకు ఊరట



రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్



డయాలసిస్ నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

- రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు
- 29 నుంచి సేవలు ప్రారంభం
- దూర ప్రాంతాలకు వెళ్లే పేషెంట్లకు తప్పనున్న తిప్పలు

రామన్నపేట: రామన్నపేట పరిసర ప్రాంత ప్రజలకు డయాలసిస్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఆస్పత్రిలో పురుషుల వార్డును ఆధునీకరించి, ఐదు బెడ్లను ఏర్పాటు చేశారు. ఒక బ్లాక్‌లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ నిర్వహణ బాధ్యత సాప్ సంస్థకు అప్పగించారు. రోజుకు 15 నుంచి 20మందికి డయాలసిస్ చేసే అవకాశం ఉంది. డయాలసిస్ నిర్వహణకు అవసరమైన స్వచ్ఛమైన జలంకోసం ప్రత్యేకంగా నీటిశుద్ధి యంత్రం బిగించారు. ఈ సెంటర్‌ను 29న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆస్పత్రివర్గాలు ఏర్పాట్లు చేస్తున్నారు. డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి వస్తుండడంతో డయాలసిస్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే పేషెంట్లు, సహాయకులకు తిప్పలు తప్పనున్నాయి.

జిల్లాలో నాలుగో డయాలసిస్ సెంటర్

డయాలసిస్ అనేది మూత్రపిండాలు విఫలమైన వ్యక్తులకు చేసే చికిత్స. ఇప్పటికే భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు చౌటుప్పల్, ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. ఒక్కో సెంటర్‌లో సుమారు 60మంది పేషెంట్లకు డయాలసిస్ సేవలు అందుతున్నాయి. రామన్నపేటలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌తో మరో 60మందికి అదనంగా సేవలు అందనున్నాయి.

గతంలో సుదూర ప్రాంతాలకు..

రామన్నపేట మండల ప్రజలతో పాటు వలిగొండ, చిట్యాల, నార్కట్‌పల్లి, మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం) మండలాలకు చెందిన డయాలసిస్ పేషెంట్లు హైదరాబాద్, నల్లగొండ, భువనగిరి, ఆలేరు, చౌటుప్పల్ సెంటర్లకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. వారానికి రెండు మూడు పర్యాయాలు దూరంగా ఉన్నటువంటి సెంటర్లకు వెళ్లి రావడం వ్యయ ప్రయాసాలతో కూడుకున్న పని. రామన్నపేటలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో వారికి వ్యయ ప్రయాసలు తప్పనున్నాయి.

పేషెంట్లు సద్వినియోగం చేసుకోవాలి



రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను 29న స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చేతులమీదుగా ప్రారంభిస్తాం. రామన్నపేట పరిసర ప్రాంత పేషెంట్లు సుదూర ప్రాంతాలకు వెళ్లే బాధ తప్పుతుంది. జిల్లాలోని నాలుగు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్లు పనిచేస్తాయి.

– డాక్టర్ చిన్నానాయక్ డీసీహెచ్‌ఎస్, యాదాద్రి భువనగిరి

క్లుప్తంగా

భూసార పరీక్షలు చేయించి ఎరువులు వేయాలి


ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగానే మిరప పంటలో ఎరువుల యాజమాన్యం చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్ తెలిపారు. బుధవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో నల్లబోతు వెంకటరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని కేవీకే శాస్త్రవేత్తలు సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్ మాట్లాడుతూ.. భూసారం పెంచడానికి వివిధ రకాల ఎరువులను మోతాదుకి మించి వాడడం వలన పోషకాల అసమతులత ఏర్పడి పంట దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. భూ భౌతిక స్థితులు దెబ్బతిని నేలలు చౌడు బారుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించడానికి నేల స్థితిగతులను తెలుసుకొని సమగ్ర పోషక యాజమాన్యం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఆదర్శ్, కిరణ్, రైతులు రణబోతు వీరారెడ్డి, నాతాల వెంకటరెడ్డి, బండి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బండి సత్యావతి, వ్యవసాయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది బోరు మోటార్లు చోరీ

రామన్నపేట: రామన్నపేట మండలం ఇంద్రపాలనగరంలో మంగళవారం రాత్రి పలువురు రైతుల వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ పొలాలకు నీరు పెట్టేందుకు గాను గ్రామంలోని పెద్దచెరువు సమీపంలో బోరు మోటార్లను ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎనిమిది మోటార్లను ఎత్తుకెళ్లారు. మరికొంత మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లను కట్ చేసి తీసుకెళ్లారు. బాధిత రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలోనూ కూడా గ్రామ పరిధిలోని వ్యవసాయ మోటార్ల వైర్లను దొంగలు అపహరించుకుపోయారు. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటుచేసి దొంగతనాలను నివారించాలని రైతులు కోరుతున్నారు.

ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం

మోతె: ఆగి ఉన్న కంటెయినర్‌ను బైక్ వెళ్తున్న వ్యక్తి ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన మోతె మండలం మామిళ్లగూడెం టోల్‌గేట్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలంలోని కుడకుడ గ్రామానికి చెందిన ఎస్కే నజీర్ బాబా(40) మంగళవారం అర్ధరాత్రి ఖమ్మం నుంచి సూర్యాపేటకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో మోతె మండలం మామిళ్లగూడెం టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నజీర్ బాబా అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

మట్టపల్లిలో విశేషారాధనలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలోని శ్రీప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి బుధవారం విశేషారాధనలు కొనసాగాయి. ఉదయం సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని నూతన వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత కల్యాణ తంతును వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణి భూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

భూతగాదాలతో దాయాదుల మధ్య ఘర్షణ

- కర్రలు, గొడ్డళ్లతో ఒకరిపై ఒకరు దాడి
- తీవ్రంగా గాయపడి ఒకరు మృతి


సామ్యా (ఫైల్)

డిండి: భూతగాదాలతో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చందంపేట మండలం ఎలమలమంద గ్రామ పంచాయతీ పరిధిలోని చాపలగేటుతండా వద్ద బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాపలగేటుతండాకు చెందిన కేతావత్ సామ్యా(55) అదే తండాకు చెందిన కేతావత్ హన్మ, భానవత్ హన్మ కుటుంబాల మధ్య కొన్ని సంవత్సరాలుగా భూతగాదాలు జరుగుతున్నాయి. అదే తండాకు చెందిన కేతావత్ లక్ష్మి నుంచి కొనుగోలు చేసిన దాదాపు రెండున్నర ఎకరాల వ్యవసాయ పొలాన్ని బుధవారం కేతావత్ సామ్యా దున్నాడు. సామ్యా దున్నతున్న పొలం ఫారెస్ట్ పరిధిలోకి వస్తుందని కేతావత్ హన్మా, భానావత్ హన్మ ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు అట్టి భూమి పట్టాదా, రెస్ట్ భూమా తేలే వరకు వ్యవసాయ పనులు నిలిపివేయాలని సామ్యాకు చెప్పి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా తాను కొనుగోలు చేసిన భూమిని దున్నతుంటే ఫారెస్ట్ అధికారులకు ఎందుకు ఫోన్ చేశారని సామ్యా కుటుంబ సభ్యులు హన్మను అడిగారు. ఈ క్రమంలో మాటామాట పెరిగి ఇరు కుటుంబాలు ఒకరిపై ఒకరు కర్రలు, గొడ్డళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో సామ్యా తలకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించగా అప్పటి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయాలపాలైన కేతావత్ మహేందర్, లోకేష్, నాగా, నెహ్రూ, హన్మను దేవరకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతుడి కుమారుడు మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

నల్లగొండ పట్టణంలో 'ఆపరేషన్ చబుత్ర'


పట్టుబడిన వారితో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

- 48 బైక్‌లు, ఐదు కార్లు, మూడు ఆటోలు సీజ్
- 24 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్ చబుత్ర కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించి 48 బైక్‌లు, ఐదు కార్లు, మూడు ఆటోలు, 80 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. 24 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అర్ధరాత్రి రోడ్లపై తిరగడం, మద్యం తాగి వాహనాలు నడపడం, గొడవలు సృష్టించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని కట్టడి చేసేందుకు ప్రతిరోజు ఇలాంటి తనిఖీ నిర్వహిస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి రోడ్లపై తిరిగితే కేసులు

అర్ధరాత్రి రోడ్లపై జులాయిగా తిరిగితే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని ఏఎస్పీ రాములునాయక్ అన్నారు. మంగళవారం రాత్రి పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన యువకులకు, వారి కుటుంబ సభ్యులకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. పిల్లలు క్రమశిక్షణతో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మరోసారి పట్టుబడితే కుటుంబ సభ్యులపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. 80 మంది పోలీసు సిబ్బంది, నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు 20 బృందాలుగా ఏర్పడి నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రమేష్, శివరాంరెడ్డి, ఎస్ఐలు రాజశేఖర్‌రెడ్డి, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిలింగ్ ఇస్తున్న ఏఎస్పీ రాములునాయక్

ఇద్దరు పిల్లలతో కలిసి వివాహిత అదృశ్యం

హుజూర్‌నగర్‌రూరల్: ఇద్దరు పిల్లలతో కలిసి వివాహిత అదృశ్యమైంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం లక్కవరం గ్రామానికి చెందిన జడ నాగరాజు, అనూష దంపతులకు కుమారుడు సందీప్(6), కుమార్తె మల్లీశ్వరి (4)ఉన్నారు. మంగళవారం ఉదయం నాగరాజు పొలం పనులకు వెళ్లగా.. అనూష(25) తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నాగరాజు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


అనూష, సందీప్, మల్లీశ్వరి

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

దేవరకొండ: భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం దేవరకొండ మండలంలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం పద్మట్‌పల్లి గ్రామానికి చెందిన కిన్నెర బాలరాజు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అరుణతో కొన్నేళ్ల క్రితం అతడికి వివాహం కాగా వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల బాలరాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఇద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం అరుణ గ్రామ శివారులో పత్తి చేనులో కూలీకి వెళ్లింది. బాలరాజు కూలీల ఎదుటనే కత్తితో భార్యపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అరుణను 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అరుణ తమ్ముడు అరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు


శేషగిరిరావు (ఫైల్)

కోదాడరూరల్: కారు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హైదరాబాద్-విజయవాడ రహదారిపై కోదాడ మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్ రోడ్ వద్ద బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన పిల్లుట్ల వెంకటేశ్వర్లు, అతడి భార్య జయమ్మ బుధవారం టీవీఎస్ మోపెడ్‌పై కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్‌లో అయ్యప్పల ఇరుముడి మహోత్సవానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో చిమిర్యాల క్రాస్ రోడ్ వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు వారిని ఢీకొట్టడంతో కిందపడిపోయారు. వెనుక నుంచి మరో కారు వస్తున్న వారిని తప్పించబోయి జయమ్మ కాలు పైనుంచి వెళ్తూ.. అదే సమయంలో అనంతగిరి మండలం గోండ్రియాలకు చెందిన తాళ్లూరి శేషగిరిరావు(72) తన భార్యను బస్సు ఎక్కించి రోడ్డు పక్కన బైక్‌పై ఉండగా అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేషగిరిరావు తీవ్రగాయాలపాలై అక్కడిక్కడే మృతిచెందాడు. జయమ్మ కాలు ఛిద్రం కావడంతో ఆమెను ఖమ్మం తరలించారు. మృతుడి అల్లుడు ఏర్నేని శ్రీమన్నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ రూరల్ పోలీసులు తెలిపారు.

ఫోర్జరీ సంతకాలతో రుణం స్వాహా

- రూ.10లక్షలు రుణం మంజూరు
- రూ.3లక్షలు మాత్రమే ఇచ్చారని ఆరోపిస్తున్న మహిళా సంఘం సభ్యులు
- అధికారులకు ఫిర్యాదు


ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న గాంధీ సమభావన సంఘం సభ్యులు

కోదాడ: మున్సిపల్ కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేసి రూ.10లక్షల రుణం తీసుకొని, తమకు రూ.3లక్షలు మాత్రమే ఇచ్చారని కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ సమభావన సంఘం సభ్యులు బుధవారం ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు.. కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డుకు చెందిన 10 మంది మహిళలు గాంధీ సమభావన సంఘం పేరుతో గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. వీరు రుణం కోసం కోదాడ యూనియన్ బ్యాంక్‌లో అకౌంట్ తీశారు. వీరికి ముందుండి రుణం ఇప్పించడంలో మహిళా కౌన్సిలర్ కీలకపాత్ర పోషించారు. అనంతరం బ్యాంక్ రుణం ఇచ్చిందని చెప్పి సభ్యులకు ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున రూ.3లక్షలు పంచారు. కానీ బ్యాంక్ జారీ చేసిన నోటీసులో ఒక్కొక్కరు రూ.లక్ష రుణం చెల్లించాలని పేర్కొన్నారు. దీంతో సభ్యులు లబోదిబోమంటూ బ్యాంక్‌ను ఆశ్రయించగా.. తాము రీసోర్స్‌పర్సన్ కెజ్జమ్మ సమక్షంలోనే రూ.10లక్షలు రుణం మంజూరు చేసినట్లు చెప్పడంతో అవాక్కయ్యారు. తమకు రూ.3లక్షలు మాత్రమే ఇచ్చి మిగతా రూ.7 లక్షలను వార్డు కౌన్సిలర్, ఆర్పీ కాజేశారని గ్రూప్ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే సదరు గ్రూప్ ఏర్పాటు చేసిన సమయంలో మున్సిపల్ కమిషనర్‌గా మహేశ్వరరెడ్డి ఉన్నారు. కానీ సభ్యులకు రుణం ఇవ్వాలని మున్సిపాలిటీ నుంచి సిఫారసు చేసిన పేపర్లపై కమిషనర్ రామానుజుల రెడ్డి సంతకం చేయడం గమనించదగ్గ విషయం. ఉద్దేశపూర్వకంగానే రుణాన్ని కాజేయడానికి మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు స్పష్టమవుతుందని పలువురు సభ్యులు అంటున్నారు. ఈ విషయంలో మున్సిపాలిటీ అధికారులు, బ్యాంక్ సిబ్బంది విచారణ చేయకుండానే రుణాలు మంజూరు చేయడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మందికి గాయాలు


బొమ్మలరామారం: ప్రమాదానికి గురైన కారును క్రేన్ సహాయంతో తరలిస్తున్న పోలీసులు

బొమ్మలరామారం: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బొమ్మలరామారం మండలంలో బుధవారం జరిగింది. బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన చెవ్వ గణేష్‌కు 15 రోజుల క్రితం కుమార్తె జన్మించింది. బుధవారం గణేష్ తన భార్య, కుమారుడు, కుమార్తెను హైదరాబాద్ నుంచి తన స్నేహితుడు సాదం నవీన్‌తో కలిసి అతని కారులో స్వగ్రామానికి తిరిగి తీసుకొస్తున్నాడు. మార్గమధ్యలో బొమ్మలరామారం మండలం రంగాపూర్ శివారులోని ఓం శివ ఫంక్షన్ హాల్ సమీపంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాదం నవీన్‌తో పాటు గణేష్‌కు అతడి భార్య, పిల్లలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కారును క్రేన్ సహాయంతో ఘటనా స్థలం నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

లారీ బోల్తా పడి క్లీనర్‌కు..

వలిగొండ: ఢిల్లీ నుంచి తమిళనాడు వెళ్తున్న లారీ వలిగొండ మండల కేంద్రంలోని మదర్ డెయిరీ పాల సెంటర్ మూలమలుపు వద్ద బుధవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ వీరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని..

అడ్డగూడూరు: బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన అడ్డగూడూరు మండలం చౌల్లరామారం గ్రామ శివారులో బుధవారం జరిగింది. చౌల్లరామారం గ్రామానికి చెందిన తలపాక యాదయ్య బుధవారం రాత్రి అదే గ్రామంలోని ఓ వ్యక్తి అంత్యక్రియలో పాల్గొని తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. గ్రామ శివారులోని గోదాము వద్ద అతడిని బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తికి..


గరిడేపల్లి: గాయపడిన జూకూరి సైదులు

గరిడేపల్లి: ట్రాక్టర్ బోల్తాపడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామ శివారులో బుధవారం జరిగింది. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన జూకూరి సైదులు మిర్యాలగూడలోని రైస్ మిల్లులో వడ్లు దిగుమతి చేసి తిరిగి వెళ్తుండగా.. గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద సూర్యాపేట-గరిడేపల్లి రహదారిపై ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సైదులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

చిలుకూరు: విద్యార్థులు బట్టీ విధానానికి స్వస్తి పలికి ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కంప్యూటర్ నిపుణుడు, రాష్ట్ర ప్రభుత్వ అపర కంప్యూటర్ మేధావి అవార్డు గ్రహీత గుగ్గిళ్ల దివ్యమూర్తి అన్నారు. బుధవారం చిలుకూరు మండలం నారాయణపురం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఒకరోజు మోటీవేషన్ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువు అనే పుస్తకంతో పాటు సమాజం అనే పుస్తకాన్ని నేర్చుకోవాలని, సమాజంలో మంచి నడవడిక ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. అనంతరం దివ్యమూర్తిను పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం గుజ్జుల నరసింహారెడ్డి, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దివ్యమూర్తిని సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యం

భానుపురి (సూర్యాపేట): ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యమని సుప్రీం కోర్టే వ్యాఖ్యానించిందని సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ పేపర్‌ను ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు మంగళవారం తోసిపుచ్చిందని తెలిపారు. ఈవీఎంల పనితీరుపై పిటిషనర్ డాక్టర్ కాల్ చేసిన వాదనల్లో వాస్తవాలు లేవని న్యాయస్థానం పేర్కొందన్నారు. బ్యాలెట్ పేపర్ వ్యవస్థను ప్రవేశపెట్టాలనే అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించిందన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

మునుగోడు: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి చెట్టును ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామ శివారులో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందినా కామళ్ల మధు(26) మునుగోడులోని ఓ బైక్ మెకానిక్ దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 8 గంటల వరకు దుకాణంలో పనిచేసి ఆ తర్వాత తన బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో చీకటిమామిడి గ్రామ శివారులోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారులు 108 వాహనానికి, అతడి కుటుంబ సభ్యులకు సమచారం ఇవ్వగా.. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మధు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ఐఏఎల్ మహాసభలకు తరలిరండి


మాట్లాడుతున్న బొమ్మగాని ప్రభాకర్

చివ్వెంల: వరంగల్‌లో నవంబర్ 30, డిసెంబర్ 1న నిర్వహించనున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర ద్వితీయ మహాసభలకు న్యాయవాదులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు సమస్యల పరిష్కారం కోసం ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, భిక్షమయ్య గౌడ్, జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, నాతి సవీందర్ కుమార్, గుడిపురి వెంకటేశ్వర్‌రావు, కేవీఎల్, వసంత సత్యనారాయణపిళ్లే యాదవ్, ఏడిండ్ల అశోక్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

కోదాడ రూరల్: హోటళ్లు, షాపుల్లో ఉన్న ఆహార పదార్థాలు, ఇతర వస్తువులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి సంజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని బైపాస్ వెంట ఉన్న సీకేసీ కాఫీ సెంటర్‌ను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కాఫీ సెంటర్‌లో వాటర్ బాటిల్, బిస్కెట్ ప్యాక్‌పై ఉన్న ఎమ్మార్పీ కంటే అధికరంగా అమ్ముతున్నారనే ఫిర్యాదు మేరకు వచ్చినట్లు తెలిపారు. ఆయా కంపెనీల అసలు ధరలు ఎంతో తెలుసుకొని అధిక ధరలకంటే ఎక్కువగా ఉన్నట్లు తేలితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640258899, 9640468899
[SCA24000705]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలుచదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తరగతి గది నుంచి వరి మడిలోకి..

గరిడేపల్లి: మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో పలువురు రైతుల పొలాలను సందర్శించారు. వారికి నేరుగా నేరుగా వరి విత్తే విధానం గురించి గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు వివరించారు. అనంతరం విద్యార్థినులు పొలాల్లోకి దిగి వరి విత్తనాలను చల్లారు. రైతులకు విత్తన శుద్ధి చేయడం వలన కలిగే లాభాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థినులు చందన, భావనారెడ్డి, అక్షయ, వర్షారెడ్డి, అలియా బేగం, రైతు మొగిలిచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గరిడేపల్లిలో పొలంలో వరి విత్తనాలు చల్లుతున్న బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు

కందికాయలకు భలే డిమాండ్

- ఔషధ గుణాలు ఉండడంతో కొనేందుకు ఆసక్తి చూపుతున్న పట్టణవాసులు
- గ్రామాల నుంచి ఆటోల్లో తీసుకొచ్చి అమ్ముతున్న వ్యాపారులు


అమ్మకానికి ఆటోలో తెచ్చిన కందికాయలు

నల్లగొండ రూరల్: కందికాయల్లో ఔషధ గుణాలు ఉండడంతో గ్రామీణ ప్రజలు వాటిని ఎక్కువగా తినేందుకు ఇష్టపడతారు. అయితే వీటి ప్రయోజనాల గురించి తెలిసిన కొంతమంది వ్యాపారులు ఆటోల్లో పచ్చి కందికాయలు తీసుకొచ్చి పట్టణాల్లో కిలోకు రూ.80 చొప్పున అమ్ముతున్నారు. పచ్చి కందికాయలను ఉప్పు వేసి ఉడికించడం, కాల్చి తినడం వల్ల ఆరోగ్యం పరిపుష్టిగా ఉంటుంది. గర్భిణుల్లో పిండం ఎదుగుదలకు దోహదపడుతుంది. చిన్నారులు బలంగా ఎదగడం, జ్ఞాపకశక్తి పెరగడం, జీర్ణక్రియ పెరుగుతుంది. ప్రొటీన్లు, కాల్షియం, ఐరన్, విటమిన్ బీ1, బీ2, బీ5 లభిస్తుంది. చెడు కొవ్వును నివారిస్తుంది. ఎర్ర రక్త కణాలను వృద్ధి చేస్తుంది. సీజనల్‌గా వచ్చే వ్యాధులను నిరోధిస్తుంది. కండరాలు బలంగా ఉండేందుకు, ఎముకల ఎదుగుదలకు కంది కాయలు ఉపయోగపడతాయి. శరీర బరువును తగ్గిస్తుంది. శరీరంలోని రక్తం అన్ని భాగాలకు సరఫరా అయ్యేలా తోడ్పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో కంది ఆకులను కషాయంగా చేసుకుని తాగుతారు. దీంతో జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. పొట్ట తగ్గుతుంది. ప్రకృతి సహజంగా లభించే కందికాయల్లో పురుగు మందు అవశేషాలు ఉండవు. ఆరోగ్య పరంగా అనేక ప్రయోజనాలు ఉండటంతో కందికాయలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. రైతులు కంది సాగు చేస్తూ హైదరాబాద్ మార్కెట్‌కు తరలించి లాభాలు పొందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పచ్చి కంది వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి కంది సాగును ప్రోత్సహిస్తే రైతులు తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పలువురు అంటున్నారు.

ఆరోగ్య సంజీవని కందికాయలు



కందికాయలు తినడం వల్ల ఆరోగ్యానికి అనేక రకాల ప్రయోజనాలున్నాయి. పచ్చి కందికాయలు కాల్చి, ఉప్పేసి ఉడకబెట్టి తింటారు. కందికాయల్లో అనేక పోషకాలు ఉండటంతో పాటు జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఎదిగే చిన్నారులకు ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుంది.

– విఠల్, వైద్యుడు